సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



వాల్మీకిని స్మరించుకుందాం

మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. 8లో



'జల' విజేత.. విశాఖ

ఉమ్మడి విశాఖ జిల్లాలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన నీటి సంరక్షణ చర్యలు.. దేశానికే ఆదర్శంగా నిలిచాయి. 8లో



బోల్తాపడిన క్రేన్

డాక్‌యార్డ్ సమీపంలోని సేవామార్గంలో ఓ క్రేన్ తిరగబడటంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. 8లో

న్యూస్‌రీల్

దేశ రక్షణలో రాజీ ప్రసక్తే లేదు

నేవీ జెట్టీ ప్రారంభించిన నౌకాదళాధిపతి



నేవీ జెట్టీని ప్రారంభిస్తున్న భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠీ

సాక్షి, విశాఖపట్నం: దేశ రక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠీ పునరుద్ఘాటించారు. విశాఖలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన సతీమణి, నేవీ వెల్ఫేర్ వెల్‌నెస్ అసోసియేషన్(ఎన్‌డబ్ల్యూడబ్ల్యూఏ) ప్రెసిడెంట్ శశి త్రిపాఠీతో కలిసి తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా నావికాదళానికి సంబంధించి అత్యాధునిక ఎన్1–ఎన్3 జెట్టీని అడ్మిరల్ త్రిపాఠీ ప్రారంభించారు. పూర్తిస్థాయి మోడ్రన్ సపోర్ట్ ఫీచర్స్‌తో యుద్ధ నౌకల బెర్తింగ్‌కు అనుగుణంగా ఈ జెట్టీని నిర్మించారు. తూర్పు నౌకాదళ అమ్ముల పొదిలోకి అదనపు యుద్ధ నౌకలు చేరుతున్న నేపథ్యంలో సమీప భవిష్యత్తులో అదనపు బెర్తింగ్‌కు ఈ జెట్టీ కీలకంగా మారుతుందని నేవీ చీఫ్ అన్నారు. ఈ సందర్భంగా ఈస్టర్న్ ఫ్లీట్‌లో ఉన్న యుద్ధ నౌకల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందితో నేవీ చీఫ్ సంభాషించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో ప్రీపెయిడ్ ట్యాక్సీ సర్వీస్ ప్రారంభం




ప్రీపెయిడ్ ట్యాక్సీ తొలి వినియోగదారుడికి అభినందనలు తెలుపుతున్న కమిషనర్ బాగ్చీ

సాక్షి, విశాఖపట్నం : ప్రయాణికులు సురక్షితంగా ఎయిర్‌పోర్టు నుంచి తమ గమ్య స్థానాలకు చేరుకునేందుకు ప్రీపెయిడ్ ట్యాక్సీ సర్వీస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు. గురువారం ఎయిర్‌పోర్టు ఆవరణలో ఈ సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి ప్రీపెయిడ్ ట్యాక్సీకి జీపీఎస్‌ని అనుసంధానం చేశామని.. ఏ కారణం చేతనైనా అనుకున్న సమయానికి ట్యాక్సీ గమ్యస్థానానికి చేరకపోతే తక్షణమే దాన్ని ట్రాక్ చేసే వీలుంటుందన్నారు. ప్రీపెయిడ్ ట్యాక్సీ నడిపే డ్రైవర్లందరూ పూర్తి శిక్షణ కలిగి ఉండడంతో పాటు వారి పర్సనల్ డేటా కూడా తమ వద్ద ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ మేరీ ప్రశాంతి, ఎయిర్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయండి

మహారాణిపేట : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 1.0 పథకంలో లబ్ధిపొందిన వారికి 2.0 పథకంలో అవకాశం ఉండదని.. ఇప్పుడు మంజూరైన ఇళ్లను ప్రతి ఒక్కరూ నిర్దీత గడువులోగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇతర అంశాలపై కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ శాఖ అధికారులు, మండల లేఅవుట్ ఇన్‌చార్జులు, ఇతర అధికారులతో ఆయన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో వ్యవహరించి లేఅవుట్లలో చేపట్టిన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, సొంత స్థలంలో కట్టుకునే వారు కూడా త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. రోజువారీ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని పనులను చేయాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని నిర్దేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ జిల్లా మేనేజర్ ఆళ్ల శ్రీనివాస్, జీవీఎంసీ అదనపు కమిషనర్లు రమణమూర్తి, వర్మ పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాలకు ఏయూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ : జాతీయ యువజన ఉత్సవాలు 'ప్రజాతంత్ర 2024'కు రాష్ట్రం నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. వీసీ ఆచార్య జి.శశిభూషణరావు గురువారం తన కార్యాలయంలో వీరిని అభినందించారు. నవంబర్ 16 నుంచి 18 వరకు లక్నోలో జరిగే ఈ యువజన ఉత్సవాలలో రాష్ట్రం తరఫున ఏయూ నుంచి ఎం.శివాని లహరి, డి.హర్షిత ప్రాతినిధ్యం వహించనున్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్, డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.

స్టాండింగ్ వసూళ్లు రూ.2 కోట్లు



8 శాతం పర్సంటేజీతో కాంట్రాక్టర్ల బెంబేలు

- చక్రం తిప్పుతున్న కాబోయే మేయర్‌నంటున్న నేత
- సహకరిస్తున్న ముగ్గురు అనుచరులు
- స్టాండింగ్ కమిటీ సభ్యులకూ హ్యాండిస్తున్న వైనం
- సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేసే యోచనలో పలువురు కాంట్రాక్టర్లు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో 'స్టాండింగ్ వసూళ్లు' చర్చనీయాంశంగా మారింది. గత నాలుగు సమావేశాల్లోనే ఏకంగా రూ.40 కోట్లకుపైగా పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఇందులో నామినేషన్‌పై చేసిన పనులకుగానూ 8 శాతం పర్సంటేజీతో రూ.2 కోట్లకుపైగా కొందరు నేతలు వసూళ్లకు తెగబడ్డారనే విమర్శలున్నాయి. పర్సంటేజీలు అందిన వాటిని మాత్రమే ఓకే చేస్తూ.. మిగిలిన వాటిని వాయిదాల పేరుతో కాలం వెళ్లబుచ్చుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారమంతా కాబోయే మేయర్‌నని చెప్పుకుంటున్న నేత కనుసన్నుల్లో జరుగుతుండగా.. ఆయన అనుచరులు ముగ్గురు మిగతాదంతా చక్కబెడుతున్నారనే విమర్శలున్నాయి. ఇదంతా గమనించిన కొందరు సభ్యులు సదరు నేతతో పాటు ఆయన అనుచరులపై మండిపడుతున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జీవీఎంసీలో ఈ పర్సంటేజీల బాగోతం పెరిగిపోవడంపై ఇప్పటికే కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. తాము అంత మొత్తం ఇచ్చుకోలేమని చెబితే పనులను వాయిదాలు వేస్తున్నారని వాపోతున్నారు. ఆలస్యమయ్యేకొద్దీ తమకు రావాల్సిన బిల్లులు రావని భయంతో పర్సంటేజీలు ఇచ్చుకోవాల్సి వస్తోందని పలువురు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వాయింపును భరించలేని మరికొందరు కాంట్రాక్టర్లు ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నట్టు సమాచారం.

కాబోయే మేయర్‌నంటూ..!



వాస్తవానికి జీవీఎంసీ స్థాయీ సంఘంతో సంబంధం లేని సదరు నేత.. కాబోయే మేయర్‌నంటూ అధికారులతో భేటీలు నిర్వహిస్తున్నారు. ఏయే పనులకు సంబంధించిన వాటిని సమావేశంలో ఆమోదించాలనే విషయంలో కూడా సూచనలు, ఆదేశాలు జారీచేస్తున్నారు. 'ఆడుదాం ఆంధ్ర' పనులు చేసిన సివిల్ కాంట్రాక్టర్లు పర్సంటేజీలు ఇవ్వలేదని.. శుక్రవారం జరగనున్న స్థాయీ సంఘ సమావేశంలో వాటిని ఆమోదించకూడదని సదరు నేత నిర్ణయించినట్లు సమాచారం. ఇదే జరిగితే కూటమి ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేయాలని కాంట్రాక్టర్లు భావిస్తున్నారు. వాస్తవానికి స్టాండింగ్ కమిటీతో సంబంధం లేకుండా సదరు నేత చేసే ఆదేశాలను పాటించేలా.. తనిఖీల పేరుతో కూడా ఆయన అనుచరులే వ్యవహారాలన్నీ చక్కబెడుతున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికే ఈ నేతలు కార్పొరేటర్ల అధ్యయన యాత్ర పేరుతో అధికారుల నుంచి కోటి రూపాయలు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ టూర్‌లో తానిచ్చే విందుతో రాబోయే కాలంలో మేయర్ కావాలని ఆయన తహతహలాడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ట్రిపుల్ ఎస్‌ల హడావుడి!

కాబోయే మేయర్‌నంటున్న నేత ఆదేశాలను పాటించేలా ఆయన అనుచరులు ముగ్గురు చక్రం తిప్పుతున్నారు. వీరంతా వేర్వేరు నియోజకవర్గానికి చెందిన వారు. వీరు ట్రిపుల్ ఎస్‌గా జీవీఎంసీలో పేరుగాంచారు. అయితే కాంట్రాక్టర్లు ముద్దుగా వీరిని ట్రబుల్ ఎస్ అని పిలుస్తుండటం గమనార్హం. మరోవైపు వీరి వ్యవహారాన్ని జీవీఎంసీ ఉన్నతాధికారి దృష్టికి ఇప్పటికే పలువురు కాంట్రాక్టర్లు తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. ఈ విషయంపై ఇప్పటికే ఆయన వీరిని పిలిచి మరీ ఈ స్థాయిలో ఇబ్బంది పెట్టడం సరికాదని వారించినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే కాబోయే మేయర్‌నంటున్న నేతను ఇప్పటికే ఒక దఫా ముఖ్యమంత్రి కార్యాలయానికి పిలిపించి మందలించినప్పటికీ పరిస్థితిలో మార్పురాలేదు. ఈసారి ఆయనతో పాటు ట్రిబుల్ ఎస్‌లపై కూడా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసే యోచనలో పలువురు కాంట్రాక్టర్లు ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై ఏ చర్యలు ఉంటాయో వేచిచూడాల్సి ఉంది.

ఆన్ డ్యూటీ కాదు.. ఓన్ డ్యూటీ..!

- వీఎంఆర్డీఏలో ఓ ఉన్నతాధికారి స్వరూపం బట్టబయలు
- విజయనగరంలోని సొంత పొలంలో సంస్థ కార్మికులతో పనులు
- మూడేళ్లుగా ఇదే తంతు.. ప్రశ్నించిన 11 మంది కార్మికులపై వేటు
- కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న బాధిత కార్మికులు



విశాఖ సిటీ: వీఎంఆర్డీఏకు కమిషనర్లు వస్తుంటారు.. పోతుంటారు.. కానీ మేము లోకల్.. అన్న తీరుతో కొంత మంది అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సంస్థ ఆస్తులు, సిబ్బంది, కార్మికులను సొంత పనులకు వినియోగించుకుంటున్నారు. తాజాగా ఒక ఉన్నతాధికారి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆ అధికారికి విజయనగరం జిల్లా అయ్యన్నపేట ప్రాంతం కరకవలస కాలనీని ఆనుకుని 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో గతంలో మామిడి తోట ఉండేది. ఆ తర్వాత ఆ చెట్లను తొలగించి చదును చేశారు. ప్రస్తుతం బొప్పాయి, పుచ్చకాయ, ఇతర పండ్ల మొక్కలు వేశారు. ఈ వ్యవసాయ భూమిలో పనులు చేస్తున్న కార్మికులు మాత్రం వీఎంఆర్డీఏకు చెందిన వారు కావడం గమనార్హం.

మస్తర్లు ఇక్కడ.. పనులు అక్కడ.!

వీఎంఆర్డీఏలో సదరు ఉన్నతాధికారి తన పలుకుబడితో సంస్థలో చక్రం తిప్పుతున్నారు. మూడేళ్లుగా వీఎంఆర్డీఏ పరిధిలోని కైలాసగిరి, హెల్త్ ఏరీనా, వైఎస్సార్ సెంట్రల్ పార్క్‌లలో పని చేసే కార్మికులు 10 నుంచి 15 మందిని విజయనగరంలోని తన వ్యవసాయ భూమిలో పనులకు వినియోగించుకుంటున్నారు. అయితే మస్తర్లు మాత్రం ఇక్కడ పని చేస్తున్నట్లే చూపిస్తున్నారు. ఒక్కో కార్మికుడికి రోజుకు రూ.560 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. సంస్థ నుంచి కార్మికులకు వేతనాలు చెల్లిస్తూ.. ఏళ్ల తరబడి సొంత పనులు చేయించుకుంటున్నప్పటికీ.. ఉన్నతాధికారులు కనీసం దృష్టి పెట్టకపోవడం గమనార్హం. దీనిపై కొంత మంది కార్మికులు ఆ అధికారిని ఇటీవల ప్రశ్నించారు. ఇక్కడ పనుల కోసం వస్తే అంత దూరం పంపించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో సదరు అధికారి 11 మంది కార్మికులపై కక్షగట్టి తొలగించారు. వారి స్థానంలో వేరే వారికి పనులు అప్పగించారు. ప్రస్తుతం వారితో కూడా విజయనగరంలో పంట పనులు చేయించుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిపై బాధిత కార్మికులు వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌ను కలిసి తమ గోడు విన్నవించుకోవాలని నిర్ణయించారు.

రైతు బజార్లలో నిర్దేశించిన ధరకే నూనెల విక్రయం

మహారాణిపేట: జిల్లాలోని రైతుబజార్లలో సన్‌ఫ్లవర్, పామ్ ఆయిల్ నూనెలను ప్రభుత్వం నిర్దేశించిన ధరకు విక్రయించాలని జేసీ మయూర్ అశోక్ స్పష్టం చేశారు. సన్ ఫ్లవర్ ఆయిల్ లీటర్ రూ.124, పామ్ ఆయిల్ లీటర్ రూ.110కు మాత్రమే విక్రయించాలన్నారు. ఒక బియ్యం కార్డుపై నెలకు మూడు ప్యాకెట్ల పామ్ ఆయిల్, ఒక ప్యాకెట్ సన్ ఫ్లవర్ ఆయిల్ అందజేస్తామన్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా 0891–2590100, 0891–2590102కు సంప్రదించాలని సూచించారు.

నవంబర్ 23 నుంచి స్ట్రీట్ ప్రీమియర్ లీగ్

విశాఖ స్పోర్ట్స్: నవంబర్ 23 నుంచి వారం రోజుల పాటు విశాఖ పోర్ట్ స్టేడియంలో వైజాగ్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ జరగనుంది. ఈ లీగ్‌లో పాల్గొనే ఎనిమిది జట్ల క్రీడాకారులను గురువారం వేలం ద్వారా ఎంపిక చేశారు. సుమారు 200 మంది ఆటగాళ్లు ఈ వేలంలో పాల్గొనగా.. ఎనిమిది జట్ల ఫ్రాంచైజీలు ఆటగాళ్లను ఎంపిక చేసుకున్నాయి. విజేతగా నిలిచే జట్టుకు రూ.5 లక్షలు, రన్నరప్‌కు రూ.3లక్షల నగదు ప్రోత్సాహకాలను అందించనున్నారు. ఉత్తమ క్రీడాకారుడికి రూ.50వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

వలంటీర్లకు బీజేపీ ఎమ్మెల్యే కుమార్తె ప్రలోభాలు

బీజేపీ సభ్యత్వం చేస్తే ఇనార్బిట్‌మాల్‌లో ఉద్యోగం పేరిట ఆఫర్



బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి హాజరైన వలంటీర్లు

సీతంపేట: 'బీజేపీ సభ్యత్వం తీసుకోండి.. చేయించండి.. ఎవరెక్కువ బీజేపీ సభ్యత్వాలు చేయిస్తే వారికి ఇనార్బిట్ మాల్‌లో ఉద్యోగం కల్పిస్తాం'..ఇదీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక వలంటీర్లకు ఇచ్చిన ఆఫర్. బీజేపీ ఉత్తర కార్యాలయంలో గురువారం ఆమె ఆరు వార్డులకు చెందిన వలంటీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యలతో వలంటీర్లు విస్తుపోయారు. ప్రభుత్వం మారాక తమ భవితవ్యం ఏమిటో తెలియక అయోమయంలో ఉన్న వలంటీర్లకు.. బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని, ఎక్కువ మందిని బీజేపీలో చేర్పించాలని, అటువంటి వారికి ఇనార్బిట్‌మాల్‌లో ఉద్యోగాలు కల్పిస్తామనడంతో వారంతా అయోమయానికి గురయ్యారు. మరోవైపు వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవడం చంద్రబాబు నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని.. తమ చేతుల్లో ఏమీ లేదని శ్యామల దీపిక ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వ మార్పుతో వలంటీర్ల భవిష్యత్తు అనిశ్చితంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న వలంటీర్లను ఉద్యోగాల పేరిట ఎమ్మెల్యే కుమార్తె ప్రలోభాలకు గురిచేయడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

నేడు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

దాబాగార్డెన్స్: మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన శుక్రవారం స్థాయీ సంఘ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో 85 అజెండా అంశాలు పొందుపరిచారు. కాగా.. సభ్యుల మధ్య డీల్ కుదిరితే వారిలో వారే చర్చించుకుని అంశాలను ఆమోదిస్తున్నారు. లేకపోతే అధికారులను నిలదీస్తూ.. ఆ వార్డు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. తర్వాత ఆ అంశాన్ని వాయిదా వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నూతన స్థాయీ సంఘ సభ్యులు ఇదే తీరును ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులకు ఆమోదం తెలపకుండా కొర్రీలు పెడుతున్నారు.

బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

- కాస్మోటిక్స్ వ్యాపారం పేరిట బెట్టింగ్‌లు
- రూ.9 కోట్ల మేర దోపిడీ.. చైనా, తైవాన్‌కు నగదు బదిలీ
- ఇద్దరు నిందితులు, నలుగురు సిబ్బంది అరెస్ట్
- ప్రధాన నిందితుల కోసం గాలింపు



ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లను చూపిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ



నిందితులు గిరీష్, సాయిరామ్

అల్లిపురం: బయటకు కాస్మోటిక్స్ వ్యాపారం.. లోపల బెట్టింగ్ వ్యవహారం నడుపుతున్న ముఠా గుట్టును విశాఖపట్నం పోలీసులు రట్టు చేశారు. నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి పెద్ద మొత్తంలో సిమ్ కార్డులు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డెస్క్ టాప్ కంప్యూటర్లు, బ్యాంక్ ఖాతా పుస్తకాలు, భారీగా నగదు, క్రెడిట్ కార్డులు, చెక్ బుక్‌లు తదితరవి స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఈ వివరాలు వెల్లడించారు. అహ్మదాబాద్ సైబర్ క్రైం పోలీసులు అందించిన సమాచారం మేరకు స్థానిక సైబర్ క్రైం, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా కేజీహెచ్ డౌన్‌లోని ఏఎన్ బీచ్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న సీ స్టైల్ అపార్ట్‌మెంట్, విశాలాక్షినగర్ ఫారెస్ట్ గెస్ట్ హౌస్ రోడ్డులోని ఇళ్లలో సోదాలు చేశారు. సాయిరామ్, గిరీష్ అనే ఇద్దరు వ్యక్తులు కాస్మోటిక్స్ బిజినెస్, కాల్ సెంటర్ పేరిట వ్యాపారం నిర్వహిస్తూ.. టీఆర్ఎక్స్ పేమెంట్ గేట్‌వేతో కూడిన చైనీస్ వెబ్‌సైట్‌ను యాక్సెస్ చేస్తున్నారు. ఆర్బీఐ అనుమతి లేకుండా పలు బెట్టింగ్ యాప్‌లు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బాధితుల నుంచి సుమారు రూ.9 కోట్ల మేర దోచుకుని.. చైనా, తైవాన్ పంపుతున్నట్టు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఈ కేసులో కాల్ సెంటర్‌లో పని చేస్తున్న నలుగురు యువతులతోపాటు సాయిరామ్, గిరీష్‌లను అరెస్ట్ చేశారు. వీరికి సహకరించిన ప్రధాన నిందితుడు సూర్యమోహన్, వియథాన్‌ల కోసం గాలిస్తున్నట్లు సీపీ తెలిపారు. సమావేశంలో డీసీపీ–1 డాక్టర్ అజిత్, సైబర్ క్రైం పోలీసులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వర్షం

- నగరాన్ని ముంచెత్తిన భారీ వర్షం
- పలు చోట్ల రహదారులు జలమయం

నగరంలోని వివిధ ప్రాంతాల్లో 16వ తేదీ ఉదయం 8.30 నుంచి 17వ తేదీ రాత్రి 9 గంటల వరకు నమోదైన వర్షపాత వివరాలివీ...

ప్రాంతం	వర్షపాతం (మి.మీలలో)
విశాలాక్షినగర్	138.25
సాగర్‌నగర్	136.75
జోగవానిపాలెం	136.25
హెచ్‌బీ కాలనీ	125.75
ఆరిలోవ	124.50
ఎంవీపీకాలనీ	122.75
రవీంద్రనగర్	116.25
సీతమ్మధార	110.25

సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో విశాఖలో వర్షం దంచికొట్టింది. నెల్లూరుకి సమీపంలో గురువారం వేకువజామున వాయుగుండం తీరం దాటిన నేపథ్యంలో.. బుధవారం అర్ధరాత్రి నుంచే ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. భారీ శబ్దాలతో ఉరుములు, పిడుగులు పడటంతో నగర వాసులు భయాందోళనలకు గురయ్యారు. 24 గంటల వ్యవధిలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో 100 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో గురువారం ఉదయం విద్యార్థులు పాఠశాలలకు, ఉద్యోగులు, కార్మికులు విధులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లు జలమయం కావడంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు. బీచ్‌రోడ్డులో వరదనీరు పొంగి పొర్లింది. సీతకొండ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. గెడ్డలు, కాలువలు ఉధృతంగా ప్రవహించాయి. వాయుగుండం ధాటికి సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడటంతో.. సందర్శకులు తీరం వైపు వెళ్లేందుకు భయపడ్డారు. మరో రెండు రోజుల విరామం అనంతరం.. అండమాన్ వద్ద సముద్రంలో ఏర్పడే వాయుగుండం ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం ప్రధానాధికారి భారతి ఎస్ సబడే తెలిపారు.



టింపనీ స్కూల్ వద్ద జలమయమైన రోడ్డు



వాయుగుండం కారణంగా కోస్టల్ బ్యాటరీ వద్ద ఎగసి పడుతున్న అలలు

బీచ్‌రోడ్డులో విరిగిపడిన కొండ చరియలు



సీతకొండ మలుపు వద్ద బీచ్ రోడ్డు పైకి జారిపడిన బండరాళ్లు

ఆరిలోవ: నగరంలో కురుస్తున్న వర్షాలకు గురువారం ఉదయం బీచ్‌రోడ్డులో కొండ చరియలు విరిగిపడ్డాయి. విశాలాక్షినగర్ నుంచి సాగర్‌నగర్ వెళ్లే బీచ్ రోడ్డులో సీతకొండ మలుపు వద్ద బండరాళ్లు జారి పడి రోడ్డంతా చెదిరిపోయాయి. ఫలితంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని జారిపడిన కొండ చరియలు వైపు వాహనాలు వెళ్లకుండా స్టాపర్లు ఏర్పాటు చేశారు. వాహనాలను పక్క నుంచి మళ్లించారు. అలాగే తెన్నేటి పార్కు వద్ద కైలాసగిరి కొండ వాలు నుంచి కొండ చరియలు విరిగిపడ్డాయి. అదృష్టవశాత్తు ఈ ఘటనల్లో ఎవరికీ ప్రమాదం జరగలేదు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు, వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

మాజీ ఎంపీ ఎంవీవీకి ఊరట

- ముందస్తు బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
- జీవీ, గద్దె బ్రహ్మాజీలకు కూడా..

సాక్షి, అమరావతి : ఎండాడలోని హయగ్రీవ భూముల వివాదంలో ఆరిలోవ పోలీసులు నమోదు చేసిన కేసులో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, చార్టెర్డ్ అకౌంటెంట్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జీవీ), బిల్డర్ గద్దె బ్రహ్మాజీలకు హైకోర్టులో ఊరట లభించింది. వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా హైకోర్టు పలు షరతులు విధించింది. రూ.30వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ గురువారం తీర్పు వెలువరించారు. ఎండాడలో అనాథ శరణాలయం, వృద్ధాశ్రమం, వృద్ధులకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి తీసుకున్న 12.5 ఎకరాల భూమిని హస్తగతం చేసుకునేందుకు ఎంవీవీ సత్యనారాయణ, ఆయన సన్నిహితుడు జి.వెంకటేశ్వరరావు, మరో బిల్డర్ గద్దె బ్రహ్మాజీ కలిసి పలు డాక్యుమెంట్లను ఫోర్జరీ చేశారంటూ హయగ్రీవ కన్‌స్ట్రక్షన్స్ అధినేత జగదీశ్వరుడు ఈ ఏడాది జూన్ 22 పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరందరూ కలిసి తనను బెదిరిస్తున్నారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఆరిలోవ పోలీసులు ఎంవీవీ సత్యనారాయణ తదితరులపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ఈ ముగ్గురూ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ కృపాసాగర్ గురువారం పై విధంగా తీర్పునిచ్చారు.

క్లుప్తంగా

విశ్రాంత తహసీల్దార్ లాలం సుధాకర్ మృతి



మహారాణిపేట: జిల్లాలో పలు మండలాల్లో తహసీల్దార్‌గా విశేష సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన లాలం సుధాకర నాయుడు విశాలాక్షినగర్ తన ఇంట్లో గురువారం మృతి చెందారు. కొంతకాలంలో ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. సుధాకర్ మృతదేహానికి ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ వి.రమేష్, నగర అధ్యక్షుడు నియోగి, కార్యదర్శి రవిశంకర్ తదితరులు నివాళులర్పించారు. రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ కార్యదర్శి కె.మధుసూదనరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

డీపీవో శ్రీనివాసరావు మృతి



మహారాణిపేట: రాజమండ్రి జిల్లా పంచాయతీ అధికారి బి.శ్రీనివాసరావు గురువారం గుండెపోటుతో మృతి చెందారు. జిల్లాలో సుమారు రెండున్నరేళ్లగా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి (పీవో)గా పనిచేసి ఇటీవల బదిలీల్లో తన మాతృశాఖ పంచాయతీరాజ్ డిపార్టుమెంటుకు వెళ్లారు. ప్రస్తుతం రాజమండ్రి డీపీవోగా పనిచేస్తున్నారు. ఆయన భౌతిక కాయాన్ని రాజమండ్రి నుంచి విశాఖ కూర్మన్నపాలెంలో తన స్వగృహానికి తీసుకువచ్చారు. శ్రీనివాసరావు మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

6 కేసుల్లో నిందితుడి అరెస్టు



కనకరాజు

మధురవాడ: పలు దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్న నిందితుడ్ని పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 4వ తేదీన మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ శ్రీ రామలింగేశ్వర స్వామి గుడిలో హుండీ చోరీ జరిగింది. దీనిపై 5వ తేదీన ఆలయ గుమస్తా పీఎంపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విశాఖ నార్త్ సబ్‌డివిజన్ సీఐ బీఎస్ఎస్ ప్రకాశ్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ ఈశ్వరరావు బృందం నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టింది. పాత మధురవాడకి చెందిన ఆకిపూడి కనకరాజు హుండీ చోరీకి పాల్పడినట్టు విచారణలో తేలింది. అంతేకాకుండా భీమిలి నియోజకవర్గంలో మూడు ఆటోలు, రెండు పల్సర్ బైకులు, దొంగిలించినట్టు నిర్ధారణ అయింది. మొత్తంగా అతడిపై ఆరు కేసులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వాహనాలను స్వాధీనం చేసుకుని కనకరాజును గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జల విజేత.. విశాఖి

ఉమ్మడి విశాఖ జిల్లాలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన నీటి సంరక్షణ చర్యలు.. దేశానికే ఆదర్శంగా నిలిచాయి. కేంద్ర ప్రభుత్వం సహకారంతో చేపట్టిన జలవనరుల అభివృద్ధికి జాతీయ జల్‌జీవన్ మిషన్ పట్టం కట్టింది. 2023 సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ జల అవార్డుల్లో దక్షిణాదిలోని అన్ని జిల్లాలను వెనక్కి నెట్టి విశాఖ అగ్రస్థానంలో నిలిచింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, 'మిషన్ అమృత్ సరోవర్'పథకం అములులో జిల్లా సాధించిన అద్భుత ఫలితాలే ఈ విజయానికి కారణం. –సాక్షి, విశాఖపట్నం

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జల సంరక్షణకు ప్రాధాన్యం
- అమృత్ సరోవర్ పథకం కింద 33 జల వనరుల పునరుద్ధరణ
- జలశక్తి అవార్డుల్లో సౌత్ జోన్‌లో నంబర్‌వన్‌గా ఉమ్మడి విశాఖ జిల్లా
- 2023లో అద్భుత ప్రగతి సాధించిందని కేంద్ర ప్రభుత్వ కితాబు



ముడసర్లోవలోని ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్రాజెక్టు



కె.కోటపాడులో అమృత్ సరోవర్‌లో భాగంగా యాళ్లబంద చెరువుకు కొత్త రూపు

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించి భూగర్భ జలాలను పెంపొందించేందుకు 'మిషన్ అమృత్ సరోవర్' పథకాన్ని అమలు చేసింది. ఈ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు పకడ్బందీగా మిషన్ అమృత్ సరోవర్‌ను అమలు చేసి 2023లో అద్భుత ఫలితాలు సాధించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎంపిక చేసిన చెరువుల్లో ముళ్ల పొదల తొలగింపు, పూడకతీత, గట్లు పటిష్టం చేసే పనులను ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టారు.

కేంద్రం కితాబు

2023లో మిషన్ అమృత్ సరోవర్ పథకం అమలులో విశాఖ జిల్లా అద్భుతంగా పనిచేసిందంటూ కేంద్రం కితాబిచ్చింది. ఈ నెల 14న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రకటించిన 5వ జాతీయ జల అవార్డుల్లో విశాఖ జిల్లా సత్తా చాటింది. 2023 సంవత్సరానికి గానూ 9 విభాగాల్లో విజేతలను ప్రకటించింది. దక్షిణాదిలో ఉన్న ఐదు రాష్ట్రాల్లో బెస్ట్ డిస్ట్రిక్ట్ అవార్డును విశాఖపట్నం సొంతం చేసుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని 132 జిల్లాలను వెనక్కి నెట్టి విశాఖ నంబర్ వన్ స్థానంలో నిలిచింది.

2023లో సాధించిన విజయాలివీ..

- అమృత్ సరోవర్ పథకం కింద 33 నీటి వనరుల పునరుద్ధరణ చేపట్టారు.
- సుమారు 2,400 వివిధ కృత్రిమ రీచార్జ్ నిర్మాణాల పునరుద్ధరణ పనులు పూర్తి చేయడం ద్వారా సుమారు 87.74 కిలోలీటర్ల నీరు ఆదా అవుతోంది.
- శారదా నది కోతకు గురికాకుండా.. నదీ పరివాహకం కింద ఉన్న వేల ఎకరాలు నీటి పాలవ్వకుండా చర్యలు చేపట్టారు. నదికి ఇరువైపులా సుమారు 336 మీటర్ల మేర గట్ల ఆధునీకీకరణ, పూడికతీత పనులు చేపట్టారు. దీని ద్వారా నదీ పరివాహకంలోని 35,000 ఎకరాలను సంరక్షించడం ద్వారా 20,600 మంది రైతులకు ప్రయోజనం చేకూరింది. అంతే కాకుండా వరద ముంపు బారి నుంచి మైదాన ప్రాంతాలను సంరక్షించారు.
- నగర పరిధిలోని ముడసర్లోవ రిజర్వాయర్‌లో పూడిక తీత పనులను చేపట్టారు. తద్వారా రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 20 శాతం పెరిగింది. దీంతో పాటు ముడసర్లోవ రిజర్వాయర్‌లో గ్రిడ్‌కు అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసిన 2 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్రాజెక్టు ద్వారా మంచి ఫలితాలు రాబట్టారు.
- ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన 2.0 పథకంలో భాగంగా 79.77 కిలో లీటర్ల నీటి నిల్వ సామర్థ్యంతో ఏకంగా 28 చెరువుల తరహా నిర్మాణాలు చేపట్టారు. ఈ నిర్మాణల వల్ల పరిసర ప్రాంతాల్లో గతంలో కంటే మిన్నగా భూగర్భ జలాలు పెరిగాయి. పంటలకు నీటి వనరులు పుష్కలంగా లభ్యమయ్యాయి.
- పర్యావరణాన్ని సంరక్షించేందుకు 2023లో 2 లక్షలకు పైగా చెట్లను నాటారు. అప్పటికే ఉన్న చెట్లు, మొక్కలను సంరక్షించే విషయంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసిందని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కితాబిచ్చింది.
- భవిష్యత్తులో చెరువులు ఆక్రమణలకు గురికాకుండా గత ప్రభుత్వం కీలకమైన అడుగు వేసింది. జిల్లాలో అందుబాటులో ఉన్న మొత్తం 491 నీటి వనరులను జియో ట్యాగింగ్ చేసి రెవెన్యూ రికార్డుల్లో అప్‌లోడ్ చేయించింది.

ఇలా.. వివిధ విభాగాల్లో నీటి వనరుల సంరక్షణకు గత ప్రభుత్వం తీసుకున్న అద్భుత చర్యలు, విశాఖ జిల్లాను దక్షిణాది రాష్ట్రాల్లో నంబర్‌వన్‌గా నిలబెట్టాయి. ఈ పనులన్నింటినీ కొలమానంగా తీసుకుని సదరన్ రీజియన్‌లో విశాఖ జిల్లాను అవార్డుకు ఎంపిక చేసినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.



జలసిరితో కళకళలాడుతున్న ఆర్‌యూ అగ్రహారం చవిటి బంద చెరువు

నాడీ సంబంధిత వ్యాధులకు మెరుగైన వైద్యం



సదస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో పలువురు వైద్యులు

మహారాణిపేట: నాడీ సంబంధిత వ్యాధులకు మెరుగైన వైద్యం అందించడానికి వైద్యులు సహకామందించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. గురువారం నగరంలో ఒక హోటల్‌లో ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ 31వ జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాడీ సంబంధిత వైద్యం అందించడంలో వైద్యుల పాత్ర చాలా కీలకమన్నారు. కంటిన్యూయింగ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంతో సీనియర్ న్యూరాలజిస్ట్ డా.కె.వెంకటేశ్వర్లు, ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూరాలజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేబాశిష్ చౌదరి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ మీనాక్షి సుందరం, ఐఎఎన్‌సీవోఎన్ 2024,ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎ.బుచ్చిరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్. గోపి, సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ సీతాజయలక్ష్మి, ప్రముఖ అంతర్జాతీయ వక్తలు డాక్టర్ ఫ్రెడ్‌మన్ (యుఎస్ఎ), డాక్టర్ దిలీప్ రాఘవేంద్ర యువగల్ (యూఎస్ఏ), డాక్టర్ అలోక్ (యూకే) పలు అంశాలపై ప్రసంగించారు. డిమెన్షియా అనే అంశంపై సీఎంఈ పుస్తకాన్ని జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేబాశిష్ చౌదరి విడుదల చేశారు.

మద్యం షాపు కోసం రక్షణ గోడనే కూల్చేశారు



ఆరిలోవ కాలనీలో వైన్‌షాపు ఏర్పాటు కోసం తొలగించిన జీవీఎంసీ రక్షణ గోడ

ఆరిలోవ: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలుగుదేశం నాయకుల అరాచకాలకు అడ్డూ అదుపూ లేకుండా ఉంది. తాజాగా టీడీపీ నాయకులు మద్యం షాపు కోసం జీవీఎంసీ నిర్మించిన రక్షణ గోడనే ఆగమేఘాలపై తొలగించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేరు చెప్పి ఈ చర్యకు పాల్పడినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వివరాలివీ.. ఆరిలోవ ఆఖరి బస్టాప్ నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వరకు నివాసాల వైపు రహదారిని ఆనుకుని కొన్నేళ్ల కిందట జీవీఎంసీ రక్షణ గోడ నిర్మించింది. గతంలో ఓ వ్యక్తి తన నివాసాన్ని షాపులుగా చేసి తన ఇంటి ముందున్న రక్షణ గోడను తొలగించేశాడు. జీవీఎంసీ అధికారులు ఈ విషయాన్ని తెలుసుకుని మళ్లీ గోడను నిర్మించారు. ఇప్పుడు అదే వ్యక్తి వైన్ షాపు ఏర్పాటు కోసం వాటిని మద్యం దుకాణ నిర్వాహకుడికి లీజుకు ఇచ్చాడు. ఇప్పుడు ఆ నిర్వాహకుడి ఒత్తిడి మేరకు టీడీపీ నాయకులు గోడను తొలగించడం వివాదాస్పదంగా మారింది. ఇక్కడ ఎమ్మెల్యే మద్యం షాపు ఏర్పాటు చేస్తున్నారని, ఎవ్వరు అడిగినా మీ పనులు ఆగిపోతాయని టీడీపీ నాయకులు బెదిరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. షాపు ఏర్పాటు చేసే చోట నుంచి 30 మీటర్ల దూరంలో నూకాలమ్మ గుడి, 80 మీటర్ల దూరంలో శివాలయం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, దగ్గరలోనే నివాసాలు ఉన్నాయి. ఇప్పటికే ఇక్కడకు సమీపంలో ఒక బార్ అండ్ రెస్టారెంట్ ఉన్న నేపథ్యంలో మరో మద్యం షాపు ఏర్పాటు చేయడంపై స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆలయాలు, పాఠశాలలకు దగ్గరగా మద్యం షాపు ఏర్పాటు చేయడం సరికాదని, ఇప్పటికే ఉన్న బార్‌ను కూడా వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. జీవీఎంసీ నిధులతో నిర్మించిన రక్షణ గోడను తొలగించే అధికారం ఎవరికీ లేదని వాదిస్తున్నారు. గతంలో ఇలాంటి ఘటన జరిగినప్పుడు గోడను పునర్నిర్మించిన జీవీఎంసీ.. ఇప్పుడు ఏ విధంగా స్పందిస్తుందో.? చూద్దాం.!

'ఎస్‌జీఎఫ్' క్రీడా ఎంపికల రీషెడ్యూల్

అగనంపూడి: ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి క్రీడా ఎంపికల నిర్వహణ తేదీలు మార్పు చేసినట్లు విశాఖ, అనకాపల్లి, ఏఎస్సార్ జిల్లాల కార్యదర్శులు వి.దేముడు, ఎం.వి.నాగేశ్వరరావు, వి.కొండబాబు ఓ ప్రకటనలో తెలిపారు. వేదికలు, తేదీల మార్పులను వ్యాయామ ఉపాధ్యాయులు గమనించి విద్యార్థులు, అర్హత పత్రాలతో హాజరు కావాలని వారు సూచించారు.

- కూండ్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కబడ్డీ అండర్–17 క్రీడాకారుల ఎంపికలు పోటీలు జరగనున్నాయి.
- తుంపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 19న ఖోఖో అండర్–17 విభాగంలో క్రీడాకారుల ఎంపిక, అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియం ఆవరణలో చెస్ అండర్–14, 17 విభాగ పోటీలు నిర్వహించనున్నారు.
- చెట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20న వెయిట్ లిఫ్టింగ్ అండర్–17 విభాగంలో పోటీలు, అండర్–14, 17 పవర్ లిఫ్టింగ్ ఎంపికలు జరగనున్నాయి.
- వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 26న యోగాసన అండర్–14, 17 విభాగంలో ఎంపికలు నిర్వహిస్తున్నారు.

'ట్రెజరీ'లో అవినీతిపై విచారణ

మహారాణిపేట: జిల్లా ట్రెజరీ కార్యాలయంలో అవినీతి ఆరోపణలపై గురువారం విచారణ జరిగింది. ఈ కార్యాలయంలో అవినీతి జరుగుతున్నట్లు సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు అందింది. దీని ఆధారంగా రాష్ట్ర ట్రెజరీ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ట్రెజరీ అధికారి, ఏటీవో గోవిందరావు కీలక సమాచారం సేకరించారు. విచారణ అనంతరం తయారు చేసిన నివేదికను రాష్ట్ర ట్రెజరీ డైరెక్టర్‌కు పంపనున్నారు.

బోల్తాపడిన క్రేన్

- తెల్లవారు 2 గంటలకు ఘటన
- మధ్యాహ్నం 3 గంటల వరకు స్తంభించిన ట్రాఫిక్
- ఇబ్బంది పడ్డ 12 వేల మంది కార్మికులు, ఉద్యోగులు



భారీగా నిలిచిపోయిన వాహనాలు



తిరగబడిన క్రైన్

మల్కాపురం: గురువారం తెల్లవారుజాము 2 గంటలు.. వాతావరణం ప్రశాంతంగా ఉంది. చిరుజల్లులు కురుస్తున్నాయి. ఒక్కసారిగా పెద్ద శబ్దం.. డాక్‌యార్డ్ సమీపంలోని సేవామార్గంలో పెద్ద క్రేన్ బోల్తా పడింది. ఉదయం 6.30 గంటలైంది. డాక్‌యార్డ్, షిప్‌యార్డ్, హెచ్‌పీసీఎల్, ఎస్ఆర్, కోరమాండల్ సంస్థల కార్మికులు ఉద్యోగులు సుమారు 12 వేల మంది రాకపోకలు ప్రారంభించారు. క్రేన్ బోల్తా పడడంతో వేలాది మంది ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. గురువారం చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలు.. ఐవోసీఎల్‌కు కొత్త పైప్‌లైన్ వేస్తున్నారు. ఈ క్రమంలో 12 టన్నుల బరువుగల పైప్‌లను 50 టన్నుల బరువు గల పెద్ద క్రేన్‌తో అమర్చే పనులను చేపట్టారు. తెల్లవారు జామున 2 గంటల తరువాత ఓ పైప్ లైన్ అమర్చారు. రెండో పైప్ లైన్ అమర్చే క్రమంలో నిర్దేశించిన ఎత్తు కంటే ఎక్కువగా క్రేన్ హైడ్రాను లేపడంతో అదుపు తప్పి తిరగబడింది. దీంతో భారీ శబ్దం ఏర్పడింది. క్రేన్ తిరగబడే సమయంలో సమీపంలో కార్మికులెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పారిశ్రామిక ప్రాంతం కావడంతో వివిధ కంపెనీల్లో షిఫ్టుల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి రాకపోకలు సాగిస్తారు. క్రేన్ బోల్తా పడడంతో భారీగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. గంటల తరబడి ట్రాఫిక్ క్లియర్ కాకపోవడంతో సుమారు 12 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ములగాడ మార్గం ద్వారా కార్మికులు, ఉద్యోగులు విధులకు హాజరుకావాల్సి వచ్చింది. మధ్యాహ్నం 3 గంటల వరకు ట్రాఫిక్ స్తంభించింది. ఎస్ఐ అప్పారావు ఘటన స్థలానికి చేరుకొని దగ్గరుండి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

చాలా ఇబ్బంది పడ్డాం



ఉదయం 7 గంటలకు షిప్‌యార్డ్‌లో పంచింగ్ చేయాలి. ఉదయం 6.30 గంటలకు డాక్‌యార్డ్ సమీపంలోని సేవామార్గానికి వచ్చా.. సుమారు గంటసేపు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాను. చేసేది లేక ములగాడ మార్గం ద్వారా సుమారు 12 కిలోమీటర్లు చుట్టూ తిరిగి విధులకు హాజరుకావాల్సి వచ్చింది. చాలా మంది ఉద్యోగులు ఇలాంటి ఇబ్బందులు పడ్డారు.

– మురళీకృష్ణ, షిప్‌యార్డ్ ఉద్యోగి

విధులకు ఆలస్యమైంది..



పైప్‌లైన్ వద్ద జరిగిన ప్రమాదం వలన తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో ములగాడ మార్గం ద్వారా విధులకు వెళ్లాను. ఎప్పుడు ఖాళీగా ఉండే ములగాడ మార్గం గురువారం ఉదయం తీవ్ర రద్దీ ఏర్పడింది. ఆలస్యంగా విధులకు హాజరుకావాల్సి వచ్చింది.

–నర్సింగరావు, శ్రావణి షిపింగ్ ఉద్యోగి

నేవీ ఉద్యోగి భార్య ఆత్మహత్య

మల్కాపురం: వరకట్నం వేధింపులు తాళలేక నేవీ ఉద్యోగి భార్య ఆత్మహత్యకు పాల్పడింది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు.. జార్ఖండ్ ప్రాంతానికి చెందిన ఖుసుబు కుమారి (28)కి విక్కీ కుమార్ అనే నేవీ ఉద్యోగితో 2016లో వివాహం జరిగింది. విక్కీ కుమార్‌కు ఇటీవల విశాఖకు బదిలీ అయింది. 60వ వార్డు సమీపంలోని బర్మాకాలనీలో ఇంటిని అద్దెకు తీసుకుని భార్యతో జీవిస్తున్నాడు. వివాహం నాడు కొంత కట్నం తీసుకున్న విక్కీ అదనంగా రూ.11 లక్షలు కావాలంటూ భార్యతో నిత్యం గొడవ పడేవారు. గురువారం కూడా వారి మధ్య గొడవ జరగ్గా ఖుసుబు ఫ్యాన్ హుక్కుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విక్కీ కోసం వచ్చిన అతని స్నేహితుడు తలుపు కొట్టగా ఎంతసేపటికీ తియ్యకపోవడంతో ఇంటి యజమాని సాయంతో కిటికీ నుంచి చూడగా ఖుసుబు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే మల్కాపురం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చూసే సరికి అప్పటికే ఖుసుబు మృతి చెందింది. వేధింపులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భీమిలి ప్రాంతీయులకు నటించే అవకాశం

దర్శకుడు పి.సి.ఆదిత్య



ఇష్టాగోష్టిలో మాట్లాడుతున్న దర్శకుడు ఆదిత్య

భీమునిపట్నం: భీమిలి పరిసర ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన వారికి నటించే అవకాశాన్ని కల్పిస్తానని ప్రముఖ లఘు చిత్ర, చలన చిత్ర దర్శకుడు పి.సి. ఆదిత్య అన్నారు. గురువారం సాయంత్రం ఇక్కడ కళా సాహితి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో పాల్గొన్నారు. తాను 30 ఏళ్లగా వంద లఘు చిత్రాలకు దర్శకత్వం వహించానని, దాంతో పాటు చలన చిత్రాలకు కూడా దర్శకత్వం వహించానన్నారు. ఎంతో మంది కొత్త కళాకారులకు అవకాశాలను ఇస్తు ప్రోత్సహిస్తున్నానని త్వరలో భీమిలి పరిసర ప్రాంతాల్లో ఒక లఘు చిత్రాన్ని చిత్రీకరించనున్నానని ఇందులో ఈ ప్రాంతానికి చెందిన వారికి అవకాశం కల్పించనున్నట్టు తెలిపారు. కళాసాహితి అధ్యక్షుడు పాత్తూరు రాజేంద్ర ప్రసాద్ వర్మ మాట్లాడుతూ ఆదిత్య దర్శకత్వం వహించిన లఘుచిత్రాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని, సింగపూర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఈయనకు డాక్టరేట్ అందజేసిందని, నాసిక్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో దాదాఫాల్కే అవార్డు అందించారని అన్నారు. అనంతరం ఆదిత్య దంపతులను ఘనంగా సత్కరించారు. కళాసాహితి కార్యదర్శి అడిదంరాజు, సభ్యులు మైలిపల్లి లక్ష్మణరావు, ముసునూరి సూర్యశ్రీనివాస్, కోటయ్య, అడిదం కిశోర్, మైలిపల్లి షణ్ముఖరావు, రామానాయుడు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షిని స్మరించుకుందాం



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న మేయర్, కమిషనర్

మహారాణిపేట: మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాలులో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కారణ జన్ముడిగా నిలిచిన వాల్మీకి.. రామాయణం నిలిచినంత కాలం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారని తెలిపారు. డీఆర్వో కె.మోహన్ కుమార్, బీసీ సంక్షేమ అధికారి శ్రీదేవి, వాల్మీకి సంఘ నాయకులు, అధికారులు పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జీవీఎంసీలో...

అల్లిపురం: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ బిపిన్ జైన్, జీవీఎంసీ అదనపు కమిషనర్లు ఎస్ఎస్ వర్మ, డీవీ రమణమూర్తి, ఆర్.సోమనారాయణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఇ.వాసుదేవరెడ్డి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సురేష్‌కుమార్, జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న, వాణి తదితరులు పాల్గొన్నారు.



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో రెండు రోజులుగా ఆకాశం కారు మబ్బులతో నిండిపోయింది. అయితే గురువారం రాత్రి కాసేపు వాతావరణం మారింది. పున్నమి చంద్రుడు తన ప్రకాశవంతమైన వెలుగుతో కారు మబ్బులను చీల్చుకొని వచ్చాడు. వెన్నెల అందాల్లో నగరం అద్భుతంగా దర్శనమిచ్చింది. ఈ దృశ్యం ప్రతి ఒక్కరి హృదయాల్లో చెరగని ముద్ర వేసింది.

-ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం